సాక్షి
నిర్మల్
మంగళవారం । 18 । ఏప్రిల్ । 2023



వడదెబ్బ... తస్మాత్ జాగ్రత్త 8లో▸
ఏప్రిల్ మాసంలోనే భానుడు భగ్గుమంటుండడంతో జనం బెంబేలెత్తుతున్నారు. ఏమాత్రం నిర్లక్ష్యం ప్రదర్శించినా వడదెబ్బ తగిలే ప్రమాదం ఉంది. ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.



పంచాయతీలకు నిధుల్లేవ్
కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి సకాలంలో నిధులు రాకపోవడంతో గ్రామపంచాయతీల నిర్వహణకు ఇబ్బందులు తప్పడం లేదు. పంచాయతీ కార్మికులకు జీతం ఇవ్వలేకపోతున్నామని సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
42.8 /27.5
వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమౌతుంది. ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతాయి. ఎండ తీవ్రత పెరుగుతుంది. ఉక్కపోత అధికంగా ఉంటుంది. వేడిగాలులు వీస్తాయి.



న్యూస్‌రీల్

మెడికల్ కళాశాల పనులు పరిశీలించిన ఎన్‌ఎంసీ బృందం


పనులు పరిశీలిస్తున్న ఎన్‌ఎంసీ బృందం

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలో కొత్తగా ఏర్పాటు చేయబోయే మెడికల్ కాలేజీలో మౌలిక సదుపాయాలు ఎలా ఉన్నాయో తెలుసుకునేందుకు ఎన్‌ఎంసీ బృందం సోమవారం రెండో దఫా పరిశీలించింది. కొన్నిచోట్ల నిబంధనల మేరకు లేని మౌలిక సదుపాయాలను సరిచేసుకోవాలని సూచించింది. నేషనల్ మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా బృందం సభ్యులు అయిన డాక్టర్ చిత్ర, గుంటూరు మెడికల్ కళాశాల అనాటమీ ప్రొఫెసర్, డాక్టర్ శ్రీనివాసులునాయుడు, బెంగుళూర్ మెడికల్ కళాశాల ఫిజియాలజీ ప్రొఫెసర్ బిహారీ వాజ్‌పాయ్ మెడికల్ కళాశాల భవనం పనులను పరిశీలించారు. అనంతరం జిల్లా ఆసుపత్రికి చేరుకుని రికార్డులు పరిశీలించారు. పలు సూచనలు చేశారు. బృందం వెంట మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జేవీడీఎస్.ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌కుమార్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ దేవేందర్‌రెడ్డి, ఆసుపత్రి ఆఫీస్ సూపరింటెండెంట్ రఘునాథ్, ఫార్మసిస్ట్ శ్రీనివాసచారి ఉన్నారు.

సిగ్నల్ సమస్య తీర్చాలని కలెక్టర్‌కు వినతి


కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న జెడ్పీటీసీ

ఖానాపూర్: మండలంలోని మారుమూల గిరిజన గ్రామాలైన బావాపూర్(ఆర్)తోపాటు దేశీనాయక్ తండాలో కనీసం సెల్‌ఫోన్ సిగ్నల్ లేక ప్రజలు అవస్థలు పడుతున్నారని పెంబి జెడ్పీటీసీ జానుబాయి అన్నారు. జిల్లా కేంద్రంలో కలెక్టర్ వరుణ్‌రెడ్డిని గ్రామస్తులతో సోమవారం కలిసి సమస్య విన్నవించారు. పెన్షన్లతోపాటు ఉపాధి కూలి డబ్బులు, రేషన్‌బియ్యం, సెల్‌ఫోన్‌లు తదితర వాటికి సిగ్నల్ లేక ఇబ్బంది పడుతున్నామని వివరించారు.

నేడు నిరసన దీక్ష

ఖానాపూర్: హైదరాబాద్‌లోని ధర్నాచౌక్‌లో మంగళవారం నిర్వహించే నిరసన దీక్షను జయప్రదం చేయాలని బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జి బన్సీలాల్ రాథోడ్ అన్నారు. నిరుద్యోగుల గోస-అఖిల పక్షం భరోసా కార్యక్రమంలో భాగంగా చేపట్టే దీక్షను విజయవంత చేయడానికి నిరుద్యోగులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. ఈ దీక్షతో పేపర్ లీకేజీలకు పాల్పడ్డ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని కోరారు.

ముగిసిన బ్యాడ్మింటన్ టోర్నీ


అవార్డులు అందిస్తున్న ఫాదర్ జోసెఫ్

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని సెయింట్ థామస్ పాఠశాలలో మూడు రోజులుగా పీసీ.రమణ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బ్యాడ్మింటన్ టోర్నమెంట్ సోమవారం ముగిసింది. అవార్డుల ప్రదానోత్సవానికి ముఖ్యఅతిథిగా సెయింట్ థామస్ పాఠశాల ఫాదర్ జోసెఫ్ హాజరయ్యారు. సతీశ్, గ్లడ్‌స్టోన్ జట్టు విజేతగా నిలవగా, జాప అనిల్, నరేష్ జట్టు రన్నర్‌గా నిలిచింది. క్రీడాకారులు సాయి, సంతోష్‌రెడ్డి ,సతీశ్, ధీరజ్ వెంకటరమణ పాల్గొన్నారు.

24 వరకు పాలిసెట్ దరఖాస్తు గడువు

ఆదిలాబాద్‌అర్బన్: రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాల నిమిత్తం నిర్వహించే పాలిసెట్ ఆన్‌లైన్ దరఖాస్తుకు ఈ నెల 24 తుది గడువని ఆదిలాబాద్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ భరద్వాజ ప్రకటనలో తెలిపారు. మే 17న ప్రవేశ పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. పాలిసెట్-2023కు సంబంధించి పూర్తి వివరాలు polycet.sbtet.telangana.gov.inవెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. పదో తరగతి పూర్తయిన విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు.

నిప్పుల కొలిమి


ఎర్రటి ఎండలో నడుచుకుంటూ..
నిర్మానుష్యంగా నిర్మల్ పంట్టణంలోని ప్రధాన రోడ్డు


ఎండలో నడుచుకుంటూ ప్రజావాణికి..


ఎండలో చంటి పిల్లలతో ప్రయాణం..

- జిల్లాలో భగ్గుమంటున్న భానుడు
- రెండు రోజులుగా రాష్ట్రంలోనే అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు
- దస్తురాబాద్‌లో రికార్డుస్థాయిలో 44.8 గరిష్ట ఉష్ణోగ్రత
- కర్ఫ్యూ వాతావరణాన్ని తలపిస్తున్న రోడ్లు

నిర్మల్‌చైన్‌గేట్: ఎండలు మండిపోతున్నాయి. జిల్లాలో భానుడు నిప్పులు కురిపిస్తున్నాడు. మూడు రోజులుగా చాలా ప్రాంతాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకుపైగా నమోదవుతున్నాయి. రాష్ట్రంలోనే అత్యధిక గరిష్ట ఉష్ణోగ్రత 44 డిగ్రీలకుపైగా రెండు రోజులుగా జిల్లాలోని దస్తురాబాద్‌లో నమోదవుతోంది. ఆదివారం 42.8 డిగ్రీలు నమోదవగా, సోమవారం 44.8 డిగ్రీలుగా నమోదైంది. ఏప్రిల్‌లో నమోదు కావాల్సిన ఉష్ణోగ్రతల కంటే రెండు డిగ్రీలు అధికంగా నమోదు కావడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడానికి జంకుతున్నారు. మధ్యాహ్నం పల్లె, పట్టణం అని తేడా లేకుండా రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. కర్ఫ్యూ వాతావరణాన్ని తలపిస్తున్నాయి. వృద్ధులు, పిల్లలు తల్లడిల్లుతున్నారు. పాఠశాలలకు వెళ్లే పిల్లలు మధ్యాహ్నం ఇళ్లకు వచ్చే సమయంలో ఎండవేడి తట్టుకోలేకపోతున్నారు. యాసంగి పంటల కోతలు కూడా మొదలు కావడంతో రైతులు, కూలీలు ఎండలో ఇబ్బంది పడుతున్నారు.

ప్రారంభం నుంచే తీవ్రత..

జిల్లాలో ఈ ఏడాది వేసవి ప్రారంభం నుంచే ఎండలు దంచి కొడుతున్నాయి. మార్చి మధ్యలో నుంచి మొదలైన ఎండల తీవ్రత క్రమంగా పెరుగుతోంది. కొన్ని రోజులు తుపాన్ ప్రభావంతో వర్షాలు కురిసినా ఎండ తీవ్రత మాత్రం పెరుగుతూనే ఉంది. ఏప్రిల్ మొదటి వారం ఉంచే పగటి ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు పైగా నమోదవుతుండటంతో ప్రజలు మధ్యాహ్నం ఇళ్ల నుంచి బయటకు రావడం లేదు. వృద్ధులు, పిల్లలు వేడి తట్టుకోలేకపోతున్నారు. ఉదయం 8 నుంచే ఎండ మొదలై 11 గంటల వరకు తీవ్రస్థాయికి చేరుతోంది.

మరింత పెరిగే అవకాశం..

వచ్చేనెలలో ఎండ తీవ్రత మరింత పెరుగుతుందని వాతావరణ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు. ఎండకు తోడు వాయవ్యం నుంచి వీచే వేడి గాలులతో ఇబ్బంది ఉంటుందని చెబుతున్నారు. వచ్చేనెలలో సగటున 46 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదయ్యే అవకాశముందని అంచనా వేస్తున్నారు.

ఆరెంజ్ జోన్‌లోకి..

గరిష్ట ఉష్ణోగ్రతలు 30 డిగ్రీలలోపు నమోదైతే సాధారణం, 35 నుంచి 40 డిగ్రీలకు చేరుకుంటే జాగ్రత్త వహించాల్సి ఉంటుంది. 41 నుంచి 46 డిగ్రీలకు చేరుకుంటే అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితి. 46 డిగ్రీలకు పైబడి నమోదైతే ప్రమాదాలు హెచ్చరికలను వాతావరణ శాఖ అధికారులు జారీ చేస్తారు. ప్రస్తుతం జిల్లాలో ఎల్లో జోన్ నుంచి ఆరెంజ్ జోన్‌కు చేరువగా ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. మధ్యాహ్నం బయటకు వెళ్లకపోవడమే మంచిదని, తప్పనిసరి వెళ్లాల్సి వస్తే తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

దస్తురాబాద్ @ 44.8

దస్తురాబాద్: రాష్ట్రంలోనే అత్యధిక పగటి ఉష్ణోగ్రతలు రెండు రోజులుగా జిల్లాలో నమోదవుతున్నాయి. దస్తురాబాద్‌లో ఆదివారం 42.8 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. సోమవారం మరో రెండు డిగ్రీలు పెరిగి 44.8 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. ఇది ఈ సీజన్‌లో రాష్ట్రంలోనే నమోదైన అత్యధిక ఉష్ణోగ్రత కావడం గమనార్హం. మంగళవారం మరో 2 డిగ్రీలు పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. అత్యధిక ఉష్ణోగ్రతలతో దస్తురాబాద్ ప్రజలు రెండు రోజులుగా మధ్యాహ్నం ఇళ్ల నుంచి బయటకు రావడం లేదు. వ్యవసాయ పనులకు వెళ్లిన కూలీలు, రైతులు నీరసించిపోతున్నారు. మధ్యాహ్నం రోడ్లన్నీ నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. ఎండ తీవ్రతతోపాటు వేడిగాలులు వీస్తున్నందున వడదెబ్బ తగిలే ప్రమాదం ఉందని, ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.


నిర్మానుష్యంగా దస్తురాబాద్

జిల్లాలో 24 గంటల్లో నమోదైన గరిష్ట ఉష్ణోగ్రతలు

ప్రదేశం	మండలం	ఉష్ణోగ్రత
దస్తురాబాద్	దస్తురాబాద్	44.8
నర్సాపూర్(జి)	నర్సాపూర్(జి)	42.5
బుట్టాపూర్	దస్తురాబాద్	42.5
పెద్దూర్	కడెం	42.4
భైంసా	భైంసా	42.1
కుభీర్	కుభీర్	41.5
వద్యాల్	లక్ష్మణచాంద	41.4
లింగపూర్	కడెం	41.1
అక్కపూర్	నిర్మల్‌రూరల్	41.1
ఖానాపూర్	ఖానాపూర్	40.8
పాత ఎల్లపూర్	ఖానాపూర్	40.6
దిలావర్‌పూర్	దిలావర్‌పూర్	40.5
పాక్‌పట్ల	సోన్	40.3
తాండ్ర	మామడ	40.1
పెంబి	పెంబి	40.0

నేడు జిల్లాకు హోం మంత్రి రాక

నిర్మల్ టౌన్: రాష్ట్ర హోం మంత్రి మహమూద్ అలీ మంగళవారం నిర్మల్‌కు రానున్నారు. చించోలి ఎక్స్ రోడ్ వద్ద నూతనంగా నిర్మించిన ఈద్గాను, మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డితో కలిసి ప్రారంభిస్తారని బీఆర్‌ఎస్ నాయకులు తెలిపారు.

బాల కార్మికులు లేని జిల్లాగా మార్చాలి

- కలెక్టర్ వరుణ్‌రెడ్డి


సమావేశంలో కలెక్టర్, ఎస్పీ

నిర్మల్‌చైన్‌గేట్: నిర్మల్‌ను బాలకార్మికులు లేని జిల్లాగా మార్చాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి అన్నారు. క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో మహిళా శిశుసంక్షేమ శాఖ, సఖీ, చైల్డ్ ప్రొటెక్షన్, బాలకార్మికుల నిర్మూలనపై అధికారులతో సోమవారం సమీక్ష నిర్వహించారు. బాల కార్మిక నిరోధక చట్టం ప్రకారం జిల్లాలో బాలకార్మికులు లేకుండా చూడాలన్నారు. ఇందుకోసం కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో తనిఖీలు చేసి వారాంతపు నివేదిక సమర్పించాలన్నారు. వెట్టిచాకిరీ కింద పెండింగ్‌లో ఉన్న కేసులను సత్వరం పరిష్కరించాలని పేర్కొన్నారు. బాల కార్మికులను గుర్తిస్తే వారిని పాఠశాలల్లో చేర్పించాలని తెలిపారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు..

జిల్లాలో రోడ్డు ప్రమాదాలు నివారించడానికి స్థానిక సర్పంచ్, ఏఈ, ఎంపీడీవో, తహసీల్దార్‌లు కలిసి ఒక కమిటీగా ఏర్పడి రోడ్డు ప్రమాదాలపై దృష్టి సారించాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి, ఎస్పీ ప్రవీణ్‌కుమార్ సూచించారు. జిల్లాస్థాయి రోడ్డు భద్రత కమిటీ - 2023 సమావేశం కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జనాభా, విస్తీర్ణం పరంగా చూసుకుంటే రోడ్డు ప్రమాదాల రేటు చాలా ఎక్కువగా ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా చిన్నచిన్న అజాగ్రత్తలతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ రాంబాబు, అడిషనల్ ఎస్పీ కాంతిలాల్ పాటిల్, డీఎస్పీ, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఎస్సైలు పాల్గొన్నారు.

అర్జీలు త్వరగా పరిష్కరించాలి

- కలెక్టర్ వరుణ్‌రెడ్డి


అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: ప్రజా ఫిర్యాదుల విభాగానికి వచ్చిన అర్జీలను అధికారులు త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ రాంబాబుతో కలిసి అర్జీలు స్వీకరించారు. సమస్యలను ఓపికగా విన్నారు. వివిధ సమస్యలపై 15 దరఖాస్తులు వచ్చాయి. డీఆర్డీవో, డీడబ్ల్యూ, ల్యాండ్ సర్వేయర్‌కు సంబంధించిన దరఖాస్తులు ఎక్కువగా ఉన్నాయి.

కలెక్టర్‌ని కలవనివ్వడం లేదు..

ప్రజాఫిర్యాదుల విభాగంలో సమస్యలను కలెక్టర్ చెప్పుకుందామని వస్తే సంబంధిత శాఖ అధికారులు అడ్డుకుని కలెక్టర్‌ను కలవనివ్వలేదని బాధితులు 'సాక్షి'కి తెలిపారు. బాసర మండలం కిర్గుల్(బి) గ్రామానికి చెందిన అమీర్‌ఖాన్ కూతురు నీలోఫర్ వయసు 18 ఏళ్లు. పుట్టుకతోనే ఆమె మరుగుజ్జు. మూడేళ్ల క్రితం సదరం క్యాంపు కార్యాలయంలో ఆర్థో విభాగానికి దరఖాస్తు చేసుకోగా పరీక్షించిన వైద్యులు వినికిడి లోపం సర్టిఫికెట్ ఇచ్చారన్నారు. ఆర్థో సర్టిఫికెట్ కావాలని అధికారుల చుట్టూ మూడేళ్లుగా తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని తెలిపారు. కలెక్టర్‌ను కలవడానికి వస్తే సంబంధిత అధికారి కలెక్టర్‌ను కలవకుండా అడ్డుకుందని తెలిపింది. తన కూతురుకు ఆర్థో సర్టిఫికెట్ ఇవ్వాలని వేడుకుంది.

అభివృద్ధి పనులను పర్యవేక్షించాలి..

ప్రజావాణి అనంతరం కలెక్టర్ తహసీల్దార్లతో మాట్లాడారు. తమ మండలాల పరిధిలోని గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను పర్యవేక్షించాలని సూచించారు. వేసవి దృష్ట్యా నర్సరీలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. సమ్మర్ క్యాంపులు ఎక్కడ నిర్వహిస్తున్నారో తెలుపాలని సూచించారు. ప్రతీ గ్రామ పంచాయతీలో లైబ్రరీ ఏర్పాటు చేయాలని, తానూర్, ముధోల్‌లో రూరల్ మార్ట్ ఏర్పాటు చేయాలన్నారు. కడెంలో చేపల మార్కెట్‌కు స్థల సేకరణ చేయాలని ఆదేశించారు. మోడల్ అంగన్వాడీ కేంద్రాలను ఎంపిక చేయాలన్నారు.

ప్రజల భద్రత పోలీసుల బాధ్యత


అర్జీదారుతో మాట్లాడుతున్న ఎస్పీ ప్రవీణ్‌కుమార్

నిర్మల్‌టౌన్: జిల్లాలో ప్రజలందరికీ భద్రత, రక్షణ కల్పించాల్సిన బాధ్యత పోలీసులదే అని ఎస్పీ ప్రవీణ్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితుల నుంచి ఫిర్యాదులను ఎస్పీ స్వీకరించారు. సమస్యలు తెలుసుకుని సంబంధిత పోలీస్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. సమస్యలు త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. సామాన్యులకు అండగా ఉండాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలీసుల సహాయం కావాలనుకునేవారు ఠాణాల్లో నిర్భయంగా ఫిర్యాదు చేయాలని తెలిపారు. అనుమానాస్పద వ్యక్తులు కనబడినా, సంఘ వ్యతిరేక చర్యలు జరుగుతున్నాయని తెలిసినా పోలీసులకు సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. జిల్లా వాట్సాప్ నంబర్ 8712659599 కు అయినా సమాచారం తెలియజేయాలని సూచించారు.

బీఆర్‌ఎస్‌కు 'పత్తిరెడ్డి' గుడ్‌బై

- కాంగ్రెస్‌లో చేరిన సారంగాపూర్ జెడ్పీటీసీ
- రాజేశ్వర్‌రెడ్డికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన టీపీసీసీ చీఫ్


కండువా కప్పి పార్టీలోకి స్వాగతిస్తున్న టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి

సారంగపూర్: నిర్మల్ నియోజకవర్గంలో రాజకీయ సమీకరణలు రోజు రోజుకూ మారుతున్నాయి. ఉద్యమ నాయకుడు, మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ముఖ్య అనుచరుడు కూచాడి శ్రీహరిరావు ధిక్కార స్వరం వినిపించిన ఘటన మరువక ముందే ఆ పార్టీ సారంగాపూర్ జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి షాకిచ్చారు. బీఆర్‌ఎస్‌కు గుడ్‌బై చెప్పారు. టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో సోమవారం కలిశారు. పార్టీ సీనియర్ నాయకుడు అద్దంకి దయాకర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. రేవంత్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మొన్నటి వరకు నిర్మల్ నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు ప్రాతినిధ్యం వహించిన ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఇటీవలే బీజేపీలో చేరారు. ఈ నేపథ్యంలో రాజేశ్వర్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరడం ప్రాధాన్యత సంతరించుకుంది.

ఆదినుంచి ధిక్కార స్వరమే...

2021లో జరిగిన స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో పత్తిరెడ్డి అధికార బీఆర్‌ఎస్ పార్టీలో కొనసాగుతూనే ధిక్కార స్వరం వినిపించారు. పార్టీకి వ్యతిరేకంగా ఎమ్మెల్సీ పదవికి నామినేషన్ సైతం దాఖలు చేశారు. అధిష్టానం బుజ్జగింపుల నేపథ్యంలో నామినేషన్ ఉపసంహరించుకున్నారు. నామినేషన్ ఉపసంహరణ తర్వాత ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలోనూ బీఆర్‌ఎస్ తరఫున పోటీ చేసిన దండేవిఠల్‌ను కాదని ఇండిపెండెంట్ అభ్యర్థికి పరోక్ష మద్దతు తెలిపారు. ఇక ఇటీవల నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలం స్వర్ణ గ్రామంలో ఏర్పాటు చేసిన బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనానికి సైతం ఆయన దూరంగానే ఉన్నారు. పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రతీ కార్యక్రమానికి దూరమవుతూ వచ్చారు. చివరకు ఆయన పార్టీ మారుతారన్న వాదనలు బలంగా వినిపించగా, తటస్థంగా ఉంటూ పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్నారు.

పత్తిరెడ్డి ప్రస్థానమిదీ..

తెలంగాణలో టీడీపీ హవా కొనసాగుతున్న సమయంలో పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి కర్షక పరిషత్ మండల అధ్యక్షుడిగా పనిచేశారు. ఆతర్వాత 1995లో కాంగ్రెస్ పార్టీలో చేరిన ఆయన స్థానిక సంస్థల ఎన్నికల్లో కౌట్ల(బి) ఎంపీటీసీగా పోటీచేసి గెలిచారు. మెజారిటీ స్థానాలు కాంగ్రెస్ కైవసం చేసుకోవడంతో ఆయన ఎంపీపీ పదవిని అధిష్టించారు. 2001లో టీడీపీ నుంచి సారంగాపూర్ జెడ్పీటీసీగా పోటీచేసి విజయం సాధించారు. అప్పటి నుంచి 2007వరకు ఆయన పదవిలో కొనసాగిన తర్వాత జెడ్పీటీసీ రిజర్వేషన్ ఎస్టీ, ఎస్సీకి కేటాయించడంతో పదేళ్లు తటస్థంగా ఉన్నారు. 2019లో మళ్లీ టీఆర్‌ఎస్ నుంచి సారంగాపూర్ జెడ్పీటీసీగా పోటీచేసి గెలిచారు. ప్రస్తుతం ఆయన జెడ్పీటీసీగా కొనసాగుతున్నారు.

సర్పంచ్, పంచాయతీ కార్యదర్శికి సన్మానం


సర్పంచ్‌ను సన్మానిస్తున్న కలెక్టర్ వరుణ్‌రెడ్డి

తానూరు: మండలంలోని ఉమ్రి(కె) పల్లె ప్రకృతి వనం రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. ఈనెల 15న హైదరాబాద్‌లోని నాంపల్లిలో పబ్లిక్ గార్డెన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ అవార్డు అందుకున్నారు. కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ వరుణ్‌రెడ్డి, అడిషనల్ కలెక్టర్ రాంబాబు సర్పంచ్ రత్నమాల, పంచాయతీ కార్యదర్శి వినయ్‌కుమార్, ఎంపీడీవో శ్రీనివాస్‌ను సోమవారం సత్కరించారు. మియావాకి పద్ధతిలో పెంచిన పల్లె ప్రకృతివనం వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీఆర్డీవో పీడీ విజయలక్ష్మి, నాయకులు మారోతిరావ్ పటేల్ ఉన్నారు.

'రాష్ట్రంలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే'


మాట్లాడుతున్న షబ్బీర్ అలీ

నిర్మల్‌చైన్‌గేట్: రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే అని కాంగ్రెస్ సీనియర్ నేత షబ్బీర్ అలీ అన్నారు. జిల్లా కేంద్రంలోని సిటీ కన్వెన్షన్ హాల్‌లో సోమవారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్‌కు ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ మహావృక్షమని పార్టీలోకి ఎందరో వస్తారు, పోతారని అన్నారు. ఇటీవల బీజేపీలో చేరిన మహేశ్వర్‌రెడ్డి కూడా మహావృక్షం నుంచి రాలిన ఓ ఆకుతో సమానమన్నారు. నిర్మల్‌కు మరో పట్టున్న వ్యక్తిని తీసుకొస్తామని చెప్పారు. కార్యక్రమంలో సారంగాపూర్ జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

అప్పులు చేసి వంట చేస్తున్నాం

- మధ్యాహ్న భోజన కార్మికుల ఆవేదన
- పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని కలెక్టరేట్ ఎదుట ధర్నా


కలెక్టరేట్ ఎదుట నినదిస్తున్న కార్మికులు

నిర్మల్‌చైన్‌గేట్: పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పథకం బిల్లులు పెండింగ్‌తో అప్పులు చేసి వంట చేస్తున్నామని మధ్యాహ్న భోజన కార్మికులు తెలిపారు. బిల్లులు విడుదల చేయాలని కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేశ్ మాట్లాడుతూ తొమ్మిది నెలల నుంచి కోడిగుడ్ల బిల్లులు, మూడు నెలల నుండి జీతాలు, బిల్లులు పెండింగ్ ఉన్నాయని తెలిపారు. పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గత మార్చి 15న సీఎం కేసీఆర్ మధ్యాహ్న భోజన కార్మికుల వేతనం రూ.2 వేలకు పెంచుతున్నట్లు ప్రకటించి జీవో విడుదల చేసినా ఇప్పటివరకు అమలు కావడం లేదని తెలిపారు. అనంతరం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందించారు. మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు హంస, చీకటి లక్ష్మి, సత్తవ్వ, భాగ్య, లక్ష్మి, ప్రభాకర్, బహుద్దీన్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ట్రిపుల్ఐటీలో ముగ్గురికి కరోనా

భైంసా: బాసర ట్రిపుల్ఐటీలో ముగ్గురు సిబ్బందికి కరోనా పాజిటివ్ వచ్చింది. అక్కడ పనిచేసే సిబ్బందిలో లక్షణాలు కనిపించడంతో సోమవారం స్థానిక ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు నిర్వహించారు. ముగ్గురికి కరోనా సోకినట్లు తెలియడంతో అక్కడివారు అప్రమత్తమయ్యారు.

అమ్మవారి సన్నిధిలో దైవజ్ఞశర్మ


పూజలు చేస్తున్న దైవజ్ఞశర్మ

భైంసా: బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారిని సరస్వతి ఉపాసకులు దైవజ్ఞశర్మ సోమవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు వారికి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ పునర్నిర్మాణం నేపథ్యంలో దర్శించుకున్నట్లు పేర్కొన్నారు.

ఆల్ పెన్షనర్స్ రాష్ట్ర కమిటీలో శశికాంత్‌కు చోటు


శశికాంత్

ఆదిలాబాద్‌అర్బన్: తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీలో జిల్లాకు చెందిన ఆ సంఘం అధ్యక్షుడు ఎస్.శశికాంత్ చోటు లభించింది. ఈనెల 15, 16న రెండు రోజుల పాటు హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన భవన్‌లో సంఘం ఐదో మహాసభలు జరిగాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర కొత్త కమిటీని ఎన్నుకున్నారు. కమిటీలో శశికాంత్ ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా కమిటీ సభ్యులు ఆయన్ను అభినందించారు.

కశ్మీర్ టు కన్యాకుమారి సైకిల్‌యాత్ర


రాజేశ్ ఖండేకర్

ఇచ్చోడ: కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు సైకిల్‌యాత్ర చేస్తున్న రాజేశ్ ఖండేకర్ సోమవారం మండలానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన సాక్షితో మాట్లాడారు. గత ఫిబ్రవరి 2న కశ్మీర్‌లోని లద్దాక్ నుంచి యాత్ర ప్రారంభించినట్లు తెలిపారు. ప్రతీరోజు 40 నుంచి 50 కి.మీ యాత్ర కొనసాగుతుందన్నారు. మరో రెండునెలల్లో కన్యాకుమారికి చేరుకుంటుందని అన్నారు. పైడిల్ లేని సైకిల్‌ను ప్రత్యేకంగా తయారు చేసుకుని కాళ్లతో నెట్టుకుంటూ యాత్ర చేస్తున్నట్లు తెలిపారు. గిన్నిస్ రికార్డు కోసమే యాత్ర ప్రారంభించినట్లు వివరించారు.

పోలీసుల అదుపులో క్రికెట్ బుకీ?

భైంసా: బాసరలోని ఓ హోటల్‌లో క్రికెట్ బుకీ నిర్వహిస్తున్న ఇద్దరిని స్పెషల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులో తీసుకున్నట్లు తెలిసింది. ఐపీఎల్ క్రికెట్ ప్రారంభం నుంచే బాసర కేంద్రంగా మహారాష్ట్ర సరిహద్దు గ్రామాల్లో క్రికెట్ బెట్టింగ్ జోరుగా కొనసాగుతోంది. స్పెషల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఈ విషయమై దృష్టిపెట్టి ఇద్దరిని అదుపులో తీసుకున్నట్లు తెలిసింది. విచారణ నిమిత్తం హైదరాబాద్‌కు తరలించినట్లు సమాచారం.


మంచిర్యాల జిల్లా కేంద్రంలో నిర్మానుష్యంగా రోడ్డు

వడదెబ్బ... తస్మాత్ జాగ్రత్త

- అత్యధికంగా నమోదవుతున్న పగటి ఉష్ణోగ్రతలు
- ప్రజల ప్రాణాలకు పొంచి ఉన్న ముప్పు
- ముందస్తు జాగ్రత్తలతో ఉపశమనం

మంచిర్యాలటౌన్/నిర్మల్‌చైన్‌గేట్: ఏప్రిల్ మాసంలోనే భానుడు భగ్గుమంటుండడంతో జనం బెంబేలెత్తుతున్నారు. ఉదయం 10 గంటలకే ఎండ తీవ్రత పెరుగుతోంది. ఇప్పుడే 42 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మే మాసంలో ఉష్ణోగ్రతలు మరింతగా పెరిగే అవకాశం ఉండడంతో ఏమాత్రం నిర్లక్ష్యం ప్రదర్శించినా వడదెబ్బ తగిలే ప్రమాదం ఉంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో రోజురోజుకూ పెరుగుతున్న ఎండల తీవ్రత నేపథ్యంలో ప్రజలు ఆరోగ్యం విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

నీటిశాతం ఎక్కువగా ఉండే ఆహారం మేలు..



- నీటిశాతం ఎక్కువగా ఉండే పండ్లు, కూరగాయలను ఆహారంగా తీసుకోవాలి. పుచ్చకాయలు, కీరదోస, కర్బూజ, తాటి ముంజలు, బీరకాయలు, పొట్లకాయలు వంటి వాటిలో నీటి శాతం పుష్కలంగా ఉంటుంది. వీటి ద్వారా శరీరానికి అవసరమైన పోషకాలు అందుతాయి. దీని వల్ల కడుపు నిండినట్లుగా ఉండి, డైట్ కంట్రోల్ అవుతుంది.
- శీతల పానీయాలు, అధికంగా షుగర్ వేసిన జ్యూస్‌లు, మ్యాంగో, సపోటా వంటివి తీసుకుంటే బరువు తగ్గకపోగా కొత్త సమస్యలు ఉత్పన్నమవుతాయి.
- వేసవిలో ఆకలి తక్కువగానూ దాహం ఎక్కువగానూ ఉంటుంది. జీర్ణక్రియలోనూ తేడాలు వస్తుంటాయి. డైట్ పాటిస్తూ కాలానికి అనుగుణంగా ఆహార పదార్థాలను తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండి బరువును నియంత్రించవచ్చు. నీరు, మజ్జిగ, కొబ్బరి నీరు తీసుకోవాలి.


వడదెబ్బ అంటే..

ఎక్కువ ఉష్ణోగ్రతల తాకిడికి గురైతే శరీరంలోని వేడిని నియంత్రించే విధానం విఫలమై ప్రాణాపాయ పరిస్థితి ఏర్పడడాన్ని వడదెబ్బ అంటారు. వేడి వాతావరణం లేదా చురుకైన పనులతో కలిగే అధిక వేడిని శరీరం తట్టుకోలేనప్పుడు ఇది సంభవిస్తుంది. అధిక ఉష్ణోగ్రతలతో శరీర ప్రాథమిక అవయవాలు విఫలమయ్యేలా చేస్తుంది.

లక్షణాలు

వడదెబ్బ తాకిన వారి కాళ్లు వాపులు వస్తాయి. కళ్లు తిరగడం, శరీర కండరాలు పట్టుకోవడం, తీవ్రమైన జ్వరం వంటి లక్షణాలు కనిపిస్తాయి. అధిక చెమట పట్టడం, తల తిరిగి పడిపోవడం వంటివి జరిగితే వెంటనే సమీపంలోని ఆస్పత్రికి తరలించి సత్వర వైద్యం అందించాలి.

ప్రాథమిక చికిత్స



- వడదెబ్బ తగిలిన వ్యక్తిని వెంటనే నీడకు తీసుకెళ్లాలి. చల్లని నీరు, ఐస్‌తో ఒళ్లంతా తుడవాలి. వదులుగా ఉన్న నూలు దుస్తులు వేయాలి.
- ఫ్యాను గాలి లేదా చల్లని గాలి తగిలేలా ఉంచాలి.
- ఉప్పు కలిపిన మజ్జిగ, కొబ్బరిబోండాం లేదా చిటికెడు ఉప్పు, చక్కెర కలిపిన నిమ్మరసం, గ్లూకోజ్ ద్రావణం లేదా ఓరల్ రీ హైడ్రేషన్ ద్రావణం (ఓఆర్ఎస్) తాగించవచ్చు.
- వడదెబ్బ తగిలి అపస్మారక స్థితిలో ఉన్న రోగిని సమీపంలోని ఆస్పత్రికి తరలించాలి.

తేలికపాటి ఆహారం ఉత్తమం

వేసవిలో సాధ్యమైనంత వరకు నూనెతో తయారు చేసిన పదార్థాలు, వేపుళ్లు, చిప్స్, జంక్‌ఫుడ్ వంటి వాటి జోలికి వెళ్లకపోవడం ఉత్తమం. తేలికపాటి ఆహారం ఆరోగ్యానికి మేలు చేస్తుంది. ముఖ్యంగా బయటి ఆహార పదార్థాలకు దూరంగా ఉండాలి. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పిల్లలను బయటకు పంపించవద్దు. వేసవి వేడిని తట్టుకునేందుకు నూనెలేని, తేలికపాటి ఆహారాన్ని పిల్లలకు అందించాలి. డీఫ్రిజ్‌లో ఉంచిన వాటిని వెంటనే తినడం, తాగడం వంటివి చేయవద్దు. సాధారణ ఉష్ణోగ్రత కంటే కొంచెం చల్లగా ఉన్న వాటిని మాత్రమే తీసుకోవాలి. బాగా చల్లగా ఉన్న నీరు తాగడం వల్ల తిన్న ఆహార పదార్థాలు జీర్ణం కావడానికి ఎక్కువ సమయం పడుతుంది. కూల్‌డ్రింక్స్‌కు పిల్లలను దూరంగా ఉంచాలి.



బారిన పడకుండా ఉండాలంటే...



- వేసవిలో డీహైడ్రేషన్ అధికంగా ఉంటుంది. రోజుకు కనీసం 15 గ్లాసుల నీరు తాగాలి. భోజనం మితంగా చేయాలి.
- ఎండ ఎక్కువగా ఉన్నప్పుడు నీడలో ఉండేందుకు ప్రయత్నించండి.
- గుండె, ఊపిరితిత్తులు, మూత్రపిండ సమస్యలు ఉన్నవారి శరీరాలకు అధిక సూర్యరశ్మి ప్రభావించి శరీరం త్వరగా డీ హైడ్రేషన్‌కు గురవుతుంది. దీంతో వ్యాధి తీవ్రతలు అధికంగా ఉంటాయి.
- ఆల్కహాల్, సిగరేట్, కార్బోనేటెడ్ వంటి ద్రావణాలకు దూరంగా ఉండాలి.
- ఎండలో వెళ్లేటప్పుడు కళ్లకు సన్‌గ్లాసెస్, తలకు టోపీ వంటివి ధరించాలి.
- వేసవిలో ఉదయం, సాయంత్రం సమయాల్లో మాత్రమే బయటికి వెళ్లేలా ప్లాన్ చేసుకోవాలి.
- వేడి వాతావరణంలో శారీరక శ్రమ చేయడం మంచిది కాదు. ఒకవేళ చేస్తే ప్రతి 20 నిమిషాలకు ఒకసారి 5 నిమిషాలు నీడలో ఉండేలా చూసుకోవాలి.
- ఆహారంలో ఎక్కువగా ద్రవ పదార్థాలు ఉండేలా చూసుకోవాలి. కారం, మసాలాలు లేకుంటే ఉత్తమం.
- ప్రయాణాల్లో సోడియం, ఎలక్ట్రోలైట్ ద్రావణాలను తాగడం మంచిది.

రోజుకు ఎనిమిది లీటర్ల నీరు తాగాలి

వేసవిలో రోజుకు ఎనిమిది లీటర్లకు తక్కువ కాకుండా నీటిని తాగాలి. తెల్లని కాటన్ దుస్తులను మాత్రమే ధరించాలి. బీపీ, షుగర్, గుండెజబ్బులు ఉన్నవారు ఎండలో ప్రయాణం చేయడం మంచిదికాదు. తప్పనిసరి పరిస్థితుల్లో వెళ్లాలంటే తలకు టోపీ, తల పాగా ధరించాలి. వడదెబ్బకు గురైనట్లు గుర్తించిన వెంటనే సమీపంలోని వైద్యుని వద్దకు తీసుకెళ్లి చికిత్స అందించాలి.

– డాక్టర్ రత్నాకర్, జనరల్ ఫిజీషియన్, నిర్మల్

చేయకూడని పనులు

- మండు వేసవిలో తీవ్ర ఉష్ణోగ్రత సమయంలో బయట ఎక్కువగా తిరగరాదు.
- రోడ్లపై విక్రయించే చల్లని రంగు పానీయాలు తాగవద్దు.
- రోడ్లపై అమ్మే కలుషిత ఆహారం తినవద్దు. ఇంట్లో వండుకున్న ఆహారం మాత్రమే తినడం మంచిది.
- ఆహారంలో మాంసాహారం తగ్గించి తాజా కూరగాయలను ఎక్కువగా తీసుకోవాలి.

జాగ్రత్తలు



ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న సమయంలో బయటకు వెళ్లకుండా ఉండేందుకు ప్రయత్నించాలి. అత్యవసరమైతే తలకు టోపీ ధరించి వెళ్లాలి. కొబ్బరి నీరు, ఉప్పు, చక్కెర, నిమ్మరసం కలిపిన నీటిని తాగాలి. ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఐవి ఫ్లూయిడ్స్‌ను జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉంచాం. నవజాత శిశువులను పల్చటి గుడ్డతో సగం వరకు కప్పి ఉంచాలి. ఇంట్లోనే ఉండే పిల్లలకు వేడి తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. వదులుగా ఉండే కాటన్ దుస్తులు ధరించాలి.

– డాక్టర్ సుబ్బరాయుడు, మంచిర్యాల జిల్లా వైద్యాధికారి

గిరిజనుల సమస్యలు పరిష్కరించాలి

- ఐటీడీఏ ఏపీవో జనరల్ భీంరావ్


అర్జీలు స్వీకరిస్తున్న ఐటీడీఏ ఏపీవో జనరల్ భీంరావ్

ఉట్నూర్: గిరిజనుల సమస్యలు పరిష్కరించాలని ఐటీడీఏ ఏపీవో జనరల్ భీంరావ్, డీడీటీడబ్ల్యూ దిలీప్‌కుమార్ పేర్కొన్నారు. ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో గిరిజనుల నుంచి 38 అర్జీలు స్వీకరించారు. ఇందులో అటవీ హక్కుల పత్రాలు, డబుల్ బెడ్రూం, పింఛన్లు, స్వయం ఉపాధి పథకాల మంజూరు కోసం అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజనుల అర్జీలను ఆయా విభాగం అధికారులు పరిశీలించి సత్వరం న్యాయం చేయాలన్నారు. వేసవిలో గిరిజన గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఓఎస్డీ కిష్టయ్య, ఏపీవో పీవీటీజీ భాస్కర్, ఏవో రాంబాబు, జేడీఎం నాగభూషణం, డీపీవో ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

- తన కుటుంబ పోషణకు ఐటీడీఏ ద్వారా ఉపాధి అవకాశం కల్పించాలని నెన్నెల మండలం జంగల్‌పేట్‌కు చెందిన శ్రీదేవి అర్జీ పెట్టుకుంది.
- స్వయం ఉపాధి కోసం ఐటీడీఏ ద్వారా టెంట్ హౌజ్ పెట్టుకోవడానికి రుణం అందించాలని భీంపూర్ మండలం వదూర్‌కు చెందిన ఆత్రం మోతీరాం విన్నవించాడు.
- ఉట్నూర్ మండలం చోప్పనికుంట గ్రామంలో వాటర్ ట్యాంక్ నిర్మాణం చేపట్టాలని టేకం తుకారాం వేడుకున్నాడు.
- గిరి వికాసం పథకం ద్వారా తమ పంట పొలంలో బోరు ఏర్పాటు, మోటార్ మంజూరు చేయాలని గాదిగూడ మండలం అర్జునికి చెందిన మోతుబాయి అర్జీ పెట్టుకుంది.
- తనకు పింఛన్ ఇప్పించాలని జైనూర్ మండలం రాశిమెట్టుకు చెందిన జుగాదిరావ్ వేడుకున్నాడు.

ఆర్జీయూకేటీలో పుస్తకావిష్కరణ


ఆవిష్కరిస్తున్న వర్సిటీ డైరెక్టర్, వీసీ, అధ్యాపకులు

భైంసా: బాసర ఆర్జీయూకేటీలో వర్సిటీ డైరెక్టర్ ప్రొఫెసర్ సతీశ్‌కుమార్ రచించిన విండ్ అండ్ సోలార్ ఎనర్జీ అప్లికేషన్స్, టెక్నాలజికల్ చాలెంజెస్ అండ్ అడ్వాన్సెస్ అనే పుస్తకాన్ని సోమవారం ఆవిష్కరించారు. వీసీ ప్రొఫెసర్ వెంకటరమణ, డీన్లు, హెచ్ఓడీలు, అధ్యాపకులు సమక్షంలో జరిగింది. ఈ పుస్తకంతో అంతర్జాతీయ స్థాయిలో విండ్, సోలార్ ఎనర్జీకి సంబంధించిన టెక్నాలజికల్ డెవలప్‌మెంట్, ఉత్పన్నమయ్యే సమస్యలకు పరిష్కారం లభిస్తుందని సతీశ్‌కుమార్ అన్నారు. వీసీ మాట్లాడుతూ అంతర్జాతీయస్థాయిలో పలు పుస్తకాలు రచిస్తూ, ఆర్జీయూకేటీలో పరిపాలన సంబంధిత వ్యవహారాల్లో చురుగ్గా పాల్గొంటున్నారని సతీశ్‌కుమార్‌ను కొనియాడారు. ఈ సందర్భంగా ఆయనకు అభినందనలు తెలిపారు.

సౌదీలో అనారోగ్యం.. ఆస్పత్రిలో చేరి..

- ఆందోళన చెందుతున్న కుటుంబీకులు
- భారత్‌కు రప్పించాలని వేడుకోలు


లింగయ్య(ఫైల్)

భైంసాటౌన్: ఉపాధి కోసం ఒకరు సౌదీ వెళ్లి అక్కడ అనారోగ్యంతో మంచం బారిన పడ్డాడు. దీంతో కుటుంబీకులు ఆందోళన చెందుతున్నారు. వివరాలు ఇలా.. పట్టణంలోని బైల్‌బజార్‌కు చెందిన తోట లింగయ్య(47) బతుకుదెరువు కోసం సౌదీకి గతంలో ఓసారి వెళ్లి రాగా, ఈసారి ఆగస్టులో మరోమారు వెళ్లాడు. కొద్దిరోజులుగా అనారోగ్యం (పక్షవాతం)తో బాధపడుతూ అక్కడే ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు తోటి సిబ్బంది తమతో తెలిపినట్లు కుటుంబీకులు పేర్కొన్నారు. కాగా, అక్కడి కంపెనీ యాజమాన్యం స్పందించడం లేదని, ఎలాగైనా లింగయ్యను భారత్‌కు రప్పించాలంటూ వేడుకుంటున్నారు. మానవతావాదులు, ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి లింగయ్యను ఇంటికి రప్పించాలని కోరుతున్నారు. సాయం చేసేవారు 97016 65028, 97050 09588 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

రోడ్డు ప్రమాదం కేసులో ఒకరికి జైలు

నిర్మల్‌టౌన్: రోడ్డు ప్రమాదం కేసులో ఒకరికి ఏడురోజుల జైలు శిక్షతోపాటు రూ.500 జరిమానా విధిస్తూ నిర్మల్ ప్రథమ న్యాయమూర్తి ఆర్.అజయ్‌కుమార్ సోమవారం తీర్పునిచ్చారు. కోర్టు సమన్వయల అధికారి సక్రియ నాయక్ తెలిపిన వివరాలు.. పట్టణానికి చెందిన సురా రాజేందర్ (40), 2016 అక్టోబర్ 15న స్థానిక శాంతినగర్ ఎక్స్‌రోడ్ వద్ద అజాగ్రత్తగా కారు నడుపుతూ నిర్మల్ వైపు బైక్‌పై తన కూతురితో వస్తున్న చొప్ప కల్ల సాయిరాంను ఢీ కొట్టాడు. దీంతో వారికి స్వల్ప గాయాలయ్యాయి. బాధితుడు ఫిర్యాదుతో అప్పటి ఎస్సై సునీల్ కుమార్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. చార్జ్‌షీట్ దాఖలు చేసి కోర్టులో హాజరుపర్చారు. పీపీ రామకృష్ణ 8 మంది సాక్షులను ప్రవేశపెట్టి, నేరం రుజువు చేయడంతో న్యాయమూర్తి తీర్పు వెలువరించారు.

బైక్ అదుపుతప్పి ఇద్దరికి గాయాలు

భైంసాటౌన్: బైక్ అదుపు తప్పి కిందపడి ఇద్దరు యువకులకు గాయాలయ్యాయి. తానూరు మండలం బెల్‌తరోడకు చెందిన జావిద్, కిరణ్ సోమవారం సాయంత్రం బైక్‌పై భైంసా–బాసర బైపాస్‌రోడ్ మీదుగా భైంసాకు వస్తుండగా, బైక్ అదుపుతప్పి కిందపడ్డారు. జావిద్‌కు తీవ్ర గాయాలు కాగా, కిరణ్‌కు స్వల్పగాయాలయ్యాయి. స్థానికులు 108కు సమాచారమివ్వగా, వారు ఏరియాస్పత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

బజార్‌హత్నూర్: మండల కేంద్రానికి చెందిన యువకుడు రాయినవెల్లి ప్రశాంత్(23) ఆస్పత్రిలో చికిత్సపొందుతూ మృతి చెందాడు. ఎస్సై సమ్మద్ ముజాహిద్ కథనం ప్రకారం..ప్రశాంత్ గతకొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఏ పనిచేయకపోవడంతో ఈనెల 9న అతని తల్లి మందలించడంతో మనస్తాపం చెంది ప్రశాంత్ పురుగుల మందు తాగాడు. తల్లిదండ్రులు ఆదిలాబాద్ రిమ్స్‌కు, అక్కడి నుంచి హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందాడు. తండ్రి మల్లేశ్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అంతర్ని గ్రామంలో ఒకరు..


కుభీర్: మండలంలోని అంతర్ని గ్రామానికి చెందిన రాథోడ్ వసంత్ (36) చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్సై ఎండీ షరాఫ్ కథనం ప్రకారం..వసంత్‌కు గత నాలుగేళ్లుగా మతిస్థిమితం లేకుండా తిరుగుతున్నాడు. ఈనెల 15న చేనులో పురుగుల మందు తాగి పడి ఉండటాన్ని కుటుంబీకులు గమనించారు. భైంసా ఏరియా అసుపత్రికి, అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలించారు. చికిత్సపొందుతూ సోమవారం సాయంత్రం మృతిచెందాడు. తండ్రి రాంచందర్ ఫిర్యాదుతో కేసు నమోదు చూసినట్లు ఎస్సై తెలిపారు.

పాత నేరస్తుడి హల్‌చల్


ఆత్మహత్యాయత్నం చేస్తున్న షేక్ మోయిజ్

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలో పాత నేరస్తుడు షేక్ మోయిజ్ సోమవారం హల్‌చల్ చేశాడు. టూటౌన్ పోలీస్‌స్టేషన్ ఎదుట తనవెంట తెచ్చుకున్న పెట్రోల్ ఒంటిపై పోసుకున్నాడు. స్టేషన్‌పైకి రాళ్లు విసరడంతోపాటు ఒంటిపై బ్లేడ్‌తో గాయపర్చుకున్నాడు. పోలీసులు తనను తరచూ వేధిస్తున్నారని గట్టిగా అరుస్తూ ఆందోళనకు దిగాడు. దీంతో రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. మోయిజ్‌ను పోలీసులు వారించే ప్రయత్నం చేశారు. తన వద్దకు వస్తే నిప్పు అంటించుకుంటానని భయబ్రాంతులకు గురిచేశాడు. నచ్చజెబుతూ వచ్చి ఆయన్ను పట్టుకుని బ్లేడ్, పెట్రోల్ బాటిల్‌ను లాక్కున్నారు. పోలీస్‌స్టేషన్ ఆవరణలో కూర్చొబెట్టారు. కొంతసేపటి తర్వాత పరారయ్యాడు. గతంలో వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ ఎదుట ఇలాగే ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు.

వైన్స్‌లో అగ్నిప్రమాదం


దగ్ధమైన మద్యం బాటిళ్లు

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని బైల్‌బజార్ సమీపంలో గల లక్కీ వైన్స్‌షాపులో సోమవారం తెల్లవారుజాము షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. షాపు నుంచి పొగలు రావడంతో స్థానికులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది వైన్స్ షటర్ తలుపు తెరిచి మంటలార్పివేసి అదుపులోకి తెచ్చారు. ఈ ప్రమాదంలో మద్యం బాటిళ్లు, రాక్‌లు, ఫ్రిజ్‌లు పూర్తిగా దగ్ధమయ్యాయి. సుమారు రూ.10 లక్షల ఆస్తినష్టం వాటిల్లిందని నిర్వాహకులు తెలిపారు.

కాంగ్రెస్‌తోనే పేదలకు న్యాయం


మాట్లాడుతున్న టీపీసీసీ కార్యదర్శి అద్దంకి దయాకర్, తదితరులు

- టీపీసీసీ కార్యదర్శి అద్దంకి దయాకర్

ఇచ్చోడ: కాంగ్రెస్ పార్టీతోనే పేద ప్రజలకు న్యాయం జరుగుతుందని టీపీసీసీ కార్యదర్శి అద్దంకి దయాకర్, ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు బెల్లయ్యనాయక్ అన్నారు. మండల కేంద్రంలోని షార్ప్ గార్డెన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన జై భారత్ సత్యాగ్రహ సభలో వారు పాల్గొని మాట్లాడారు. దేశంలో మోదీ ప్రభుత్వం లక్షల కోట్లు దోచుకుంటుంటే, రాష్ట్రంలో కేసీఆర్ కుటుంబం వేల కోట్లు దండుకుంటుందన్నారు. ఎన్నికల్లో ఓట్లు దండుకోవడానికి పథకాల పేరుతో బీఆర్ఎస్ ప్రభుత్వం కుట్ర చేస్తోందన్నారు. చనిపోయే బామ్మకు పెన్షన్ ఇస్తారు కాని ఆ బామ్మను సాదుకునే మనువడికి ఉద్యోగం ఇవ్వడం లేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక నిరుద్యోగ యువత కోసం 2 లక్షల ఉద్యోగాల భర్తీకి క్యాలెండర్ విడుదల చేస్తోందన్నారు. సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్, నియోజకవర్గ నాయకుడు అడె గజేందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహిముద్‌ఖాన్, ఉట్నూర్ జెడ్పీటీసీ చారులత, జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి పసుల చంటి తదితరులు పాల్గొన్నారు.

జేసీబీ దొంగల అరెస్టు

- వాహనం స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్

ఇచ్చోడ: రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన ఇద్దరు జేసీబీ దొంగలను పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. మహారాష్ట్రలోని యావత్మాల్ జిల్లా పాండ్రాకొడలో వారిని అదుపులో తీసుకుని, జేసీబీని స్వాధీనం చేసుకున్నారు. ఇచ్చోడ పోలీస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్ వివరాలు వెల్లడించారు. నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లిలో నరేందర్ అనే వ్యక్తికి జేసీబీ ఉంది. గత ఫిబ్రవరి 28న ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం ఇస్లాంనగర్‌లో నెల రోజులు పని ఉందని రాజస్థాన్‌కు చెందిన సూలెమాన్, సోకియస్‌లు జేసీబీని లీజుకు తీసుకున్నారు. వారం పాటు అక్కడి ప్రాంతంలో పనిచేస్తున్నట్లు నమ్మించి జేసీబీతో సహా మహారాష్ట్రకు పరారయ్యారు. పాండ్రాకొడలో జేసీబీతో పనులు చేస్తూ వచ్చిన డబ్బులతో జల్సాలు చేసేవారు. ఈ క్రమంలో జేసీబీని విక్రయించే ప్రయత్నం చేశారు. లీజుకు తీసుకున్న ఇద్దరు వ్యక్తులతోపాటు జేసీబీ ఆచూకీ తెలియకపోవడంతో నరేందర్ ఇచ్చోడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ ముదావత్ నైలు, సీసీఎస్ సీఐ చంద్రమౌళి, ఎస్సై శ్రీకాంత్‌లు కేసు దర్యాప్తు చేపట్టారు. పాండ్రాకొడలో నిందితులు ఉన్నట్లు సమాచారంతో పోలీసులు అక్కడికెళ్లి వారిని పట్టుకుని, జేసీబీ స్వాధీనం చేసుకున్నారు. వారిని పట్టుకునేందుకు కృషిచేసిన సీఐ, ఎస్సైలను, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు. ఈ సమావేశంలో సీఐ నైలు, ఇచ్చోడ, నేరడిగొండ ఎస్సైలు శ్రీకాంత్, సాయన్న, ఏఎస్సై చారి, రైటర్ దత్తులు పాల్గొన్నారు.

పంచాయతీలకు నిధుల్లేవ్

- తొమ్మిది నెలలుగా కేంద్రం మొండిచేయి
- ఆరు నెలలుగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి మంజూరు కాని నిధులు
- అప్పుల ఊబిలో సర్పంచ్‌లు
- వేతనాలు అందక మల్టీపర్పస్ వర్కర్ల ఇబ్బంది



దస్తురాబాద్ గ్రామ పంచాయతీ

దస్తురాబాద్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి సకాలంలో నిధులు రాకపోవడంతో గ్రామపంచాయతీల నిర్వహణకు ఇబ్బందులు తప్పడం లేదు. పారిశుధ్య పనులకు, విద్యుత్ బిల్లుల చెల్లింపునకు, పంచాయతీల్లో పని చేస్తున్న కార్మికులకు జీతం ఇచ్చేందుకు కష్టమవుతుందని ఆయా గ్రామాల్లోని సర్పంచ్‌లు వాపోతున్నారు.

నిధులు రాక ఇబ్బందులు..

జిల్లాలో గ్రామపంచాయతీలు 396 ఉండగా వాటిల్లో మేజర్ పంచాయతీల సంఖ్య ఆరు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిధులు విడుదల చేస్తేనే గ్రామాల్లో అభివృద్ధి జరిగేది. కాని ఇందుకు భిన్నంగా తొమ్మిది నెలలుగా కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులు.. ఆరు నెలలుగా రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయడం లేదు. దీంతో గ్రామాల్లో చేపట్టే పారిశుధ్య, నిర్వహణ పనులతోపాటు ఇతర అభివృద్ధి పనులకు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది.

జీతాలు ఇవ్వలేని స్థితిలో...

ప్రభుత్వాలు నిధులు విడుదల చేయకపోవడంతో పలుచోట్ల సర్పంచ్‌లు అప్పులు తెచ్చి అభివృద్ధి పనులు చేయించుకుంటున్నారు. కొన్ని చోట్ల పనులు పెండింగ్‌లో ఉంటున్నాయి. పారిశుధ్య కార్మికులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితి నెలకొంది.

గతంలో పంచాయతీలకు కేంద్రం మంజూరు చేసే ఎఫ్ఎఫ్‌సీ నిధులకు తోడుగా రాష్ట్ర ప్రభుత్వం ఎస్ఎఫ్‌సీ నిధులు జమ చేసేది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం నిధులు నిలిపివేయగా ఖాతాల్లో ఉన్న నిధులపై రాష్ట్ర ప్రభుత్వం ఫ్రీజ్ చేయడంతో గ్రామపంచాయతీల్లో అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. పెండింగ్ బిల్లులు, బకాయిలను పరిశీలిస్తే ఒక్కో గ్రామ పంచాయతీకి జనాభాను బట్టి రూ.ఏడు వేల నుంచి నుంచి రూ.16 లక్షల వరకు నిధులు విడుదల కావాల్సి ఉందని సర్పంచ్‌లు పేర్కొంటున్నారు.

పంచాయతీకి ప్రతినెలా ఖర్చులు..

పారిశుధ్య కార్మికుల వేతనాలు, ట్రాక్టర్ ఈఎంఐ, ఇంధనం చెల్లింపులు, విద్యుత్ బిల్లుల చెల్లింపులు పారిశుధ్యం, హరితహారం నిర్వహణ తోపాటు ప్రత్యేక కార్యక్రమాల్లో అదనపు కార్మికుల ఏర్పాటు వంటి ఖర్చులు ఉంటాయని సర్పంచ్‌లు తెలిపారు.

ఆదాయం సరిపోవడం లేదు..

ప్రతినెలా పంచాయతీకి ఇంటిపన్నుల ద్వారా ఆదాయం సమకూరుతోంది. కాని పూర్తిస్థాయిలో వసూలు కావడం లేదు. దీంతో సర్పంచ్‌లపై మరింత ఆర్థికభారం పడుతోంది. ఇటీవల పంచాయతీ పరిధిలో దుకాణాల లైసెన్సు ద్వారా వచ్చే సొమ్మును సైతం రాష్ట్ర ప్రభుత్వమే మళ్లించుకుంటుంది.

జీతాలు ఇవ్వలేక పోతున్నాం



గ్రామంలో మల్టీపర్పస్ వర్కర్లకు జీతాలు ఇవ్వలేకపోతున్నాం. ట్రాక్టర్‌లో డీజిల్ లేక చెత్త సేకరణ, పారిశుధ్య సమస్య ఎదురవుతుంది. మా గ్రామపంచాయతీకి రూ.2లక్షలు రావాలి. ఇబ్బంది అవుతుంది. ప్రభుత్వం చిన్న గ్రామపంచాయతీలను ఆదుకోవాలి. – అంజన్న, సర్పంచ్, దేవునిగూడెం

నెలలుగా పైసా రాలే..



మా పంచాయతీకి కొన్ని నెలలుగా పైసా రాలే. సకాలంలో పంచాయతీలకు నిధులు రాకపోవడంతో అభివృద్ధి పనులు పెండింగ్‌లో పడుతున్నాయి. ఏం చేయాలో తోచడం లేదు. నిధుల్లేక నిర్వహణ కష్టమవుతుంది. – సిడాం లక్ష్మి, సర్పంచ్, గొడిసీర్యాల గోండుగూడ

వివరాలు సేకరిస్తున్నాం



జిల్లాలోని అన్ని గ్రామపంచాయతీలకు రావాల్సిన నిధుల వివరాలను సేకరిస్తున్నాం. ప్రభుత్వానికి పంపి నిధులు మంజూరయ్యేలా చూస్తాం. – డీపీవో, శ్రీలత

క్లుప్తంగా

ఉచిత విద్యుత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

సోన్: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ఎస్సీ, ఎస్టీలు 100 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఏఈ శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఆయన కార్యాలయంలో మాట్లాడారు. వినియోగదారులు తమ ఆధార్, కుల ధ్రువీకరణ పత్రాలతో కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

అంబేద్కర్ జయంతి


పూలమాల వేస్తున్న నాయకులు

తానూరు: భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలని సర్పంచ్ సాయినాథ్ అన్నారు. సోమవారం మండలంలోని ఖర్బాలా గ్రామంలో అంబేద్కర్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా పంచరంగి జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో దిగంబర్ పటేల్, సొసైటీ డైరెక్టర్ ప్రకాశ్, మిలింద్, భీంరావ్, గంగాధర్, బయాసాబ్, అభిజిత్, రమేశ్, సురేశ్, కిశోర్ పాల్గొన్నారు.

'కంటివెలుగు' ప్రారంభం

లక్ష్మణచాంద: న్యూవెల్మల్–బొప్పారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మండలంలోని నర్సాపూర్(డబ్ల్యూ)లో కంటివెలుగు శిబిరాన్ని జెడ్పీటీసీ రాజేశ్వర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురికి కంటి పరీక్షలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ లలిత, ఎంపీటీసీ గణేశ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ముధోల్: మండలంలోని చించాల పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంటివెలుగు శిబిరాన్ని సర్పంచ్ సంగీత మరిభ పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యురాలు అయేషా తంకీస్, ఉపసర్పంచ్ సందీప్ ఉన్నారు.

దివ్యాంగులకు ట్రైసైకిళ్లు సమకూర్చిన ఎన్‌ఆర్‌ఐలు

సోన్: మండలంలోని ముగ్గురు దివ్యాంగులకు ఎన్‌ఆర్‌ఐలు రూ.24వేల విలువైన ట్రైసైకిళ్లు సమకూర్చి మానవత్వం చాటారు. పాక్‌పట్ల, గాంధీనగర్ గ్రామాలకు చెందిన ఎల్లయ్య, భీముడు, సుభాశ్ అనే ముగ్గురు దివ్యాంగులు ట్రైసైకిళ్లు లేక ఇబ్బందులు పడటాన్ని చూసిన స్థానిక నాయకులు మార గంగారెడ్డి తమ బంధువైన లక్ష్మణచాంద మండలం చామన్‌పెల్లికి చెందిన ఎన్ఆర్ఐ అరవింద్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన అరవింద్‌రెడ్డి అమెరికాలో తన మిత్రులు నవీన్–స్పందనరెడ్డి, రాహుల్, దినేశ్–దీపికరెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, రాహుల్‌రెడ్డి, యశ్వంత్, మనోహర్‌రెడ్డితో ఆర్థిక సహకారం అందించారు. దీంతో సోమవారం పాక్‌పట్లలో దివ్యాంగులకు ట్రైసైకిళ్లు పంపిణీ చేశారు. ఇందులో నారాయణ, నాగరాజు, సాయిరెడ్డి, ఉదయ్, నరేందర్, ముత్యం రెడ్డి, జనార్దన్, గంగాధర్ తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కుంటాల: మండలంలోని కల్లూర్ సబ్‌స్టేషన్ పరిధిలో 33/11కేవీ మరమ్మతుల నేపథ్యంలో మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శివప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. లింబా(కే), ఓలా సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నామని.. వినియోగదారులు సహకరించాలని వారు కోరారు.

క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోవాలి

నర్సాపూర్(జి): ప్రభుత్వ స్థలాల క్రమబద్ధీకరణకు మీసేవ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తహసీల్దార్ శ్రీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. అసైన్డ్, అభ్యంతరం లేని ప్రభుత్వ భూమిని రెండో తేదీ జూన్ 2020లోపు ఆక్రమించుకున్న ఇంటిస్థలం, ఖాళీ స్థలం కలిగి ఉన్నవారు ఈనెల 30లోగా దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

లోకేశ్వరం: మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రభుత్వ భూముల్లో ఇళ్లు నిర్మించుకున్నవారు ఈనెల 30లోగా మీసేవాలో దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ సరిత ఒక ప్రకటనలో తెలిపారు.

మున్సిపల్ గదుల వేలం వాయిదా

ఖానాపూర్: పట్టణంలోని మున్సిపాలిటీ ప రిధిలో 26గదులకు జరగాల్సిన బహింగవేలం వాయిదా వేస్తున్నట్లు కమిషనర్ రత్నాకర్‌రావు ప్రకటించారు. సోమవారం స్థానిక కార్యాలయం ఆవరణలో చైర్మన్ రాజేందర్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. మున్సిపల్ గదుల కోసం వేలంలో పాల్గొనేందుకు కేవలం ఐదు గదులకు మాత్రమే డీడీలు వచ్చాయన్నారు. ఆసక్తి గల వారు మిగతా గదుల కోసం బుధవారం వరకు డీడీ తీసీ కార్యాలయంలో అందజేయాలన్నారు. గురువారం తిరిగి వేలం నిర్వహిస్తామన్నారు. మున్సిపల్ కాంగ్రెస్ ఫ్లోర్‌లీడర్ చిన్నం సత్యం, కౌన్సిలర్ సంతోశ్, సుమన్, శంకర్ తదితరులు ఉన్నారు.

అటెన్షన్ ప్లీజ్.. రోడ్డు ఇలా.. ప్రయాణం ఎలా?



తానూరు: మండలంలోని జౌలా(బి) ఎక్స్‌రోడ్డు నుంచి దౌలతాబాద్ వరకు ఉన్న బీటీ రోడ్డుపై గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారింది. దీంతో వాహనదారులు రాత్రివేళ గుంతలు ఏర్పడక ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టి సమస్య పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

– ప్రశ్నించాల్సిన అధికారి: జగదీశ్, పీఆర్ ఏఈ, ఫోన్: 91211 35623

కూలీలకు సౌకర్యాలు కల్పించాలి


పనులు ప్రారంభిస్తున్న ఎంపీడీవో సల్మాన్‌రాజ్

లోకేశ్వరం: ఉపాధి కూలీలకు పని ప్రదేశంలో అన్ని సౌకర్యాలు కల్పించాలని ఎంపీడీవో సల్మాన్‌రాజ్ అన్నారు. సోమవారం మండలంలోని రాజూర గ్రామంలో ఉపాధిహామీ పనులను ఎంపీడీవో ప్రారంభించి మాట్లాడారు. ఎండల నేపథ్యంలో ఉదయం త్వరగా వచ్చి పనులు చేసి వెళ్లాలని కూలీలకు సూచించారు. కార్యక్రమంలో ఏపీవో జగన్నాథ్, టీఏ రవీందర్, సర్పంచ్ ముత్తగౌడ్, ఉపసర్పంచ్ ప్రసాద్, పోతన్న పాల్గొన్నారు.

రైతుబజార్‌లో..

కూరగాయలు	కిలో(రూ.లో)
టమాటా	10
వంకాయ	40
బెండకాయ	40
పచ్చిమిర్చి	50
కాకరకాయ	50
బీరకాయ	60
క్యారెట్	100
గోరుచిక్కుడు	60
కొత్తిమీర	120
అల్లం	50
ఎల్లిగడ్డ	60
ఉల్లిగడ్డ	20
ఆలుగడ్డ	20

– నిర్మల్‌టౌన్

సినిమాలు



తిరుమల : దసరా
నారాయణ: శాకుంతలం

ముస్లింల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- ఎమ్మెల్యే రేఖానాయక్


ఖానాపూర్‌లో కానుకలు అందిస్తున్న ఎమ్మెల్యే

ఖానాపూర్: ముస్లిం, మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే రేఖానాయక్ అన్నారు. సోమవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ముస్లింలకు రంజాన్ కానుకలు పంపిణీ చేశారు. పట్టణంలో ఈద్గా కోసం రెండెకరాల స్థలం కేటాయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అంకం రాజేందర్, వైస్ చైర్మన్ కలీల్, పుప్పాల శంకర్, రామునాయక్, మెహరాజ్, సర్జిల్, రాజగంగన్న, గంగాధర్ తదితరులు ఉన్నారు.

కుంటాల: మండలంలోని కల్లూర్ గ్రామంలో ముస్లింలకు బీఆర్‌ఎస్ నాయకులు రంజాన్ కానుకలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పెంటవార్ దశరథ్, భోజన్న, సునీల్ రెడ్డి, దత్తు, శ్యాం, జమల్ సాబ్, యూసుఫ్, రమేశ్, అఖిల్ పాల్గొన్నారు.

భైంసారూరల్: మండలంలోని తిమ్మాపూర్‌లో సోమవారం ముస్లింలకు ప్రభుత్వం అందించిన రంజాన్ కిట్లను బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు భూమారెడ్డి పంపిణీ చేశారు. గ్రామంలో షాదిఖానా నిర్మాణం కోసం తెలంగాణ ప్రభుత్వం రూ.10లక్షలు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. పీఏసీఎస్ డైరెక్టర్ లస్మన్న, జావిద్,అజీజ్, ఫారూఖ్, గోపి, మల్లేశ్, నవీన్‌రెడ్డి, చిన్నారెడ్డి, ముత్తన్న ఉన్నారు.

రంజాన్ కానుకలు

కడెం: మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే రేఖానాయక్ ముస్లిలకు రంజాన్ కానుకలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వర్లు, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు చంద్రశేఖర్, రైతుబంధు సమితి మండల కన్వీనర్ జీవన్‌రెడ్డి, రఫీక్ అహ్మద్, లక్ష్మణ్, చోటు, హసీబ్, తదితరులు ఉన్నారు.

గ్రామాల్లో బూత్ స్వశక్తికరణ్ అభియాన్


మలక్‌చించోలిలో పథకాలు వివరిస్తున్న నాయకులు

సారంగపూర్: మండలంలోని చించోలి(ఎం), తాండ్ర(జి), కౌట్ల(బి) గ్రామాల్లో సోమవారం బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సామరాజేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు బీజేపీ స్వశక్తి కరణ్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వంఅమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించారు. పార్టీ బలోపేతం చేసేందుకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా సామరాజేశ్వర్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో నిర్మల్ గడ్డపై బీజేపీ జెండాను ఎగురవేసేలా ప్రతీ కార్యకర్త శక్తివంచన లేకుండా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు రాచకొండ సాగర్, పార్టీ మండలాధ్యక్షుడు విలాస్, మండల ప్రధాన కార్యదర్శి తేజు, నరేందర్, శేఖర్, అనిల్, దయాకర్, మోహన్, రాజేశ్వర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

రెగ్యులరైజ్ చేయాలని నిరసన


నల్లబ్యాడ్జీలతో పంచాయతీ కార్యదర్శుల నిరసన

ముధోల్: మండలంలోని ఆయా గ్రామాల జూనియర్ పంచాయతీ కార్యదర్శులు సోమవారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమను నియమించి నాలుగేళ్లవుతున్నా రెగ్యులరైజ్ చేయకపోవడం అన్యాయమని కార్యదర్శుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఆనంద్‌రావు, సాయినాథ్ అన్నారు. టీఎఫ్ఎస్ఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈనెల 28 నుంచి నిరవధిక సమ్మెకు వెళ్తామన్నారు. అనంతరం ఎంపీడీవో సురేశ్‌బాబుకు సమ్మె నోటీసు అందజేశారు. కార్యక్రమంలో అశోక్, పోతన్న, గంగాధర్, భాస్కర్, భానుగౌడ్, రాజ్‌కుమార్, అమిత తదితరులు ఉన్నారు.

అర్జీదారుల అవస్థలు


చెట్ల కింద వేచి ఉన్న అర్జీదారులు


నీరు లేక ఖాళీగా డబ్బా

జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణికి తమ గోడు చెప్పుకునేందుకు అర్జీదారులు వస్తుంటారు. కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులను కలిసి తమ సమస్య పరిష్కరించాలని వేడుకుంటారు. సోమవారం వచ్చిన అర్జీదారులు కనీస సౌకర్యాలు లేకపోవడంతో కార్యాలయ ఆవరణలో ఉన్న చెట్ల నీడన కూర్చొని కాలం వెళ్లదీస్తున్నారు. కనీసం తాగునీరు, నీడ సౌకర్యం కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

నిర్మాణ పనుల పరిశీలన

ముధోల్: మండల కేంద్రంలోని శ్రీ సరస్వతీ శిశుమందిర్ ఉన్నత పాఠశాల నూతన భవన నిర్మాణ పనులను సోమవారం సమితి జిల్లా కార్యదర్శి సోలాపూర్ రాజేశ్వర్ పరిశీలించారు. పలు వివరాలు తెలుసుకొని సంతృప్తి వ్యక్తం చేశారు. సమితి కార్యదర్శి సుదర్శన్, ప్రధానాచార్యులు సారథి రాజు పాల్గొన్నారు.

అవగాహన

ఖానాపూర్: మండలంలోని తర్లపాడ్‌లో సోమవారం అగ్నిమాపకశాఖ ఆధ్వర్యంలో అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రమాదాల నివారణకు లిక్విడ్ పెట్రోలియం గ్యాస్‌పై ప్రదర్శనలు చేశారు. కార్యక్రమంలో సిబ్బంది వెంకటేశ్వర్లు, ముభిన్, మధుకర్, హరికృష్ణ, శంకర్, సత్తన్న, వెంకటేశ్, దిలీప్, చిన్నయ్య పాల్గొన్నారు.

వైరల్‌గా హారతి వింత..!

భైంసాటౌన్: పట్టణంలోని శ్రీ మహాలక్ష్మి మందిరం సమీపంలోని హనుమాన్ ఆలయంలో హారతి వింత చోటు చేసుకున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. శనివారం సాయంత్రం ఆలయంలో పూజారి విష్ణుశర్మ హారతి ఇచ్చిన అనంతరం కింద ఉంచగా, దీపం కొద్ది నిమిషాలపాటు స్వయంగా కదులుతున్న వీడియో సామాజిక మాధ్యమంలో వైరల్ అయింది. ఇది దేవుని మహిమేనని స్థానికులు చర్చించుకుంటున్నారు.

డిగ్రీ కళాశాల అధ్యాపకుల సంఘం ఎన్నిక

నిర్మల్‌ఖిల్లాగేట్:తెలంగాణ ప్రభుత్వ డిగ్రీ కళాశాల గెజిటెడ్ టీచర్ల సంఘం నిర్మల్ జిల్లా కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కట్కం మురళి(భైంసా), ప్రధాన కార్యదర్శిగా యు.రవికుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఎన్నికల అధికారి టి.ప్రతాప్‌సింగ్ తెలిపారు. వీరికి నిర్మల్, భైంసా డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లు డాక్టర్ బీమారావ్, డాక్టర్ సుధాకర్, ఆయా కళాశాలల సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

సంక్షిప్త వార్తలు

ఎండల వేళ అప్రమత్తంగా ఉండాలి

లక్ష్మణచాంద: ఎండల తీవ్రత పెరుగుతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ కవితారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు రోజులుగా మధ్యాహ్నం 12 నుంచి మూడు గంటల వరకు బయటకు రావొద్దని సూచించారు.

లోకేశ్వరం: ఎండలు పెరుగుతున్నందున మండల ప్రజలు ఉదయం 11:30 గంటల్లోపు పనులు ముగించుకొని ఇళ్లకు చేరాలని తహసీల్దార్ సరిత ఓ ప్రకటనలో తెలిపారు. తిరిగి సాయంత్రం 4:30 గంటల తర్వాత పనులు చేసుకోవాలని కోరారు.

ఘనంగా ఇఫ్తార్‌విందు

ఖానాపూర్: పట్టణంలోని ఏఎంకే ఫంక్షన్‌లో ప్రభుత్వం చేపట్టిన ఇఫ్తార్‌విందు ఘనంగా నిర్వహించారు. ముస్లిం పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు చేసి ఇఫ్తార్‌ను ప్రారంభించగా ఎమ్మెల్యే రేఖానాయక్ హాజరయ్యారు. టీజీవో జిల్లా అధ్యక్షుడు అజ్మీరా శ్యాంనాయక్, మున్సిపల్ చైర్మన్ అంకం రాజేందర్, వైస్ చైర్మన్ ఖలీల్, తహసీల్దార్ రాజమోహన్, నాయకులు మెహరాజ్, షర్జిల్ తదితరులు ఉన్నారు.

సన్మానం

లోకేశ్వరం: మండలంలోని పుస్పూర్ గ్రామంలో భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ రాజేశ్‌బాబును సోమవారం జెడ్పీ మాజీ చైర్మన్ లోలం శ్యాంసుందర్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మార్కెట్‌కు వచ్చే రైతులకు ఇబ్బంది లేకుండా చూస్తామని శ్యాంసుందర్ పేర్కొన్నారు. పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్‌రావు, బీఆర్‌ఎస్ నాయకులు బాయమోల్ల భోజన్న, శ్యాంసుందర్, సుదర్శన్‌రెడ్డి, కపిల్, భుజంగ్‌రావు, సాయారెడ్డి, మోహన్‌రెడ్డి, ప్రశాంత్, సుధాకర్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, ముత్యంరెడ్డి పాల్గొన్నారు.

నూతన సౌండ్ సిస్టం ప్రారంభం

భైంసా: ఆర్జీయూకేటీ బాసరలో స్టూడెంట్ ఆక్టివిటీ సెంటర్‌లో ఆడిటోరియం నూతన సౌండ్ సిస్టంను సోమవారం వీసీ వెంకటరమణ, డైరెక్టర్ ప్రొఫెసర్ సతీశ్‌కుమార్ ప్రారంభించారు. విద్యార్థుల మానసిక ఉల్లాసానికి వివిధ కార్యక్రమాలు నిర్వహించేందుకు రూ.5 లక్షలతో సౌండ్ సిస్టమ్‌ను ఆడిటోరియంలో ఏర్పాటు చేశామని వారు పేర్కొన్నారు.

'బలగం' ప్రదర్శన

దస్తురాబాద్: మండల కేంద్రంలోని పంచాయ తీ కార్యాలయంలో సోమవారం బలగం సినిమాను సర్పంచ్ రాజమణి ఆధ్వర్యంలో ప్రదర్శించారు. అనుబంధాల గొప్పతనం వివరించే సినిమాను గ్రామస్తుల కోరిక మేరకు ప్రదర్శించామని సర్పంచ్ అన్నారు.

ఓటరు నమోదు చేపట్టాలి

నర్సాపూర్(జి): ఓటర్ల నమోదు ప్రక్రియను ప క డ్బందీగా చేపట్టాలని తహసీల్దార్ శ్రీకాంత్ పేర్కొన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం బీఎల్‌వోలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. క్షేత్రస్థాయి పరిశీలన అ నంతరం తొలగించిన వివరాలను మరోసారి ధ్రువీకరించుకోవాలన్నారు. గిర్దావర్ వేణుగోపాల్ పాల్గొన్నారు.

ఇళ్లస్థలాలు క్రమబద్ధీకరించాలి

కడెం: మండల కేంద్రంలో ప్రభుత్వ భూముల్లో ఉన్న ఇళ్ల స్థలాలను క్రమబద్ధీకరించాలని కడెం మాజీ సర్పంచ్ చిన్నయ్య సోమవారం ప్రజా ఫిర్యాదుల విభాగంలో ఇన్‌చార్జి తహసీల్దార్ చిన్నయ్యకు వినతి పత్రం అందజేశారు. 2015లో జీవో నం.59 ప్రకారం ఇళ్లస్థలాల క్రమబద్ధీకరణకు తహసీల్దార్ పేరిట గ్రామస్తులు రూ.లక్షలు జ మ చేసినా.. నేటికి క్రమబద్ధీకరించలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ఆత్మీయ సమ్మేళనం విజయంతం చేయండి

కుంటాల: మండల కేంద్రంలోని మున్నూరు కాపు సంఘ భవనంలో ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించే ఆత్మీయ సమ్మేళనం విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ పార్టీ కన్వీనర్ దత్తాత్రి పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం సమ్మేళనం ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు శంకర్‌గౌడ్, జుట్టు మహేందర్, అశోక్‌రెడ్డి, బుచ్చన్న, ప్రవీణ్‌కుమార్, చంద్రకాంత్, వెంకటేశ్, మహేశ్వర్, హైమద్, రజనీకాంత్, రమణగౌడ్, పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

'ప్రభుత్వ ఇఫ్తార్‌విందు బహిష్కరిస్తున్నాం'

ఖానాపూర్: సీఎం కేసీఆర్ చేపట్టిన ప్రభుత్వ ఇఫ్తార్ విందులను తాము బహిష్కరిస్తున్నామని కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి షబ్బీర్‌పాషా అన్నారు. సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇఫ్తార్‌విందుల పేరిట ముస్లిం మైనార్టీలను మోసం చేస్తున్న ప్రభుత్వం.. ఇచ్చిన హామీ మేరకు బడ్జెట్‌లో 12శాతం నిధులను కేటాయించాలన్నారు. ఉద్యోగ నోటిఫికేషన్లలోను 12 శాతం రిజర్వేషన్ ఇవ్వాలన్నారు. ఖానాపూర్‌లోని ఏఎంకే ఫంక్షన్‌హాల్‌లో చేపట్టే ఇఫ్తార్ విందులకు తాము గైర్హాజరవుతున్నట్లు ప్రకటించారు.

మొక్కజొన్న పంట దగ్ధం.. రూ.లక్షల్లో నష్టం

కుభీర్: మండలంలోని కుప్టి గ్రామంలో సోమవారం సాయంత్రం ఉచ్చ సాయన్నకు చెందిన మొక్కజొన్న చేనులో విద్యుత్ తీగలు ఒకదానికొకటి తగిలి మంటలు అంటుకున్నాయి. సుమారు ఐదెకరాల్లో పంట కాలిపోగా రూ.నాలుగు లక్షల నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు. అదే విధంగా కస్రా గ్రామంలో తిరుపతి పటేల్‌కు చెందిన చేనులో మొక్కజొన్న పంట కాలిపోగా సుమారు రెండు లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు బాధిత రైతు తెలిపారు.

ఉపాధ్యాయులకు పీఆర్సీ ప్రకటించాలి

ఖానాపూర్: ప్రభుత్వ ఉపాధ్యాయులకు పీఆర్సీ ప్రకారం 40శాతం ఫిట్‌మెంట్ ప్రకటించాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి బి.రాజేశ్‌నాయక్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విద్యుత్ ఉద్యోగులకు ఏడు శాతం ఫిట్‌మెంట్ ప్రకటించి.. ఉపాధ్యాయులను విస్మరించడం సరికాదన్నారు. నెహ్రూ, రాము ఉన్నారు.